క్లుప్తంగా

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

మొయినాబాద్: విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ బానోతు హము నాయక్ తెలిపారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. సబ్‌స్టేషన్‌కు రాలేనివారు 9440813099 నెంబర్‌లో సంప్రదించొచ్చని సూచించారు.

ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి


టీకాలు వేస్తున్న డాక్టర్ శ్రీలత

మొయినాబాద్: జీవాలకు రోగాలు రాకుండా రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కనకమామిడి పశువైద్య కేంద్రం వైద్యాధికారి శ్రీలత అన్నారు. శ్రీరాంనగర్‌లో గురువారం గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల గొర్రెలు, మేకలకు రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలన్నారు. ఈ టీకాలను పశుసంవర్ధక శాఖ ద్వారా ఉచితంగా వేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి


యాదయ్య (ఫైల్)

మొయినాబాద్: నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన సురంగల్ సమీపంలోని ఫాంహౌస్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అమీర్‌గూడ గ్రామానికి చెందిన మేకగూడం యాదయ్య(55) కొంత కాలంగా పెద్దమంగళారానికి చెందిన ఉప్పరి బాబు వద్ద సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. గురువారం ఓ ఫాంహౌస్‌లోని మూడో అంతస్తుపై సెంట్రింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ క్రమంలో అతనికి తీవ్ర గాయాలవడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు.. జోరు..

గ్రామాల్లో ముమ్మర ప్రచారం


కమ్మదనంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్‌ఎస్ నాయకులు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళుతూ ఇంటింటి ప్రచారం జోరుగా చేస్తున్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలో 6, 7వార్డుల్లో సర్పంచ్ నర్సింలు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. కారు గుర్తుకు ఓటువేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, గులాబ్‌శ్రీను, రవి, వెంకటేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచారం

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బొలిగిద్ద సత్యనారాయణ అన్నారు. గురువారం తోల్‌కట్ట, జాతీయ రహదారిపై ఉన్న చౌరస్తా, తోల్‌కట్ట కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిగిద్ద సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ గెలుపునకు ప్రతీ కార్యకర్త పనిచేయాలని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని జోస్యం చెప్పారు. తోల్‌కట్ట మాజీ సర్పంచ్ సత్యనారాయణ, రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎండి అప్సర్ అలీ, మండల రైతు సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి భుజంగరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగయ్య, గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం పాల్గొన్నారు.


తోల్‌కట్ట ప్రచారంలో సత్యనారాయణ

అంతా సిద్ధం..


చేవెళ్లలో ఏర్పాటు చేసిన బారికేడ్లు


నామినేషన్లు స్వీకరించే ఆర్డీఓ కార్యాలయం

- నేటి నుంచే నామినేషన్లు ప్రారంభం
- అభ్యర్థితో పాటు నలుగురికే అనుమతి
- కార్యాలయంలో హెల్ప్ డెస్కు ఏర్పాటు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వెల్లడి

షాద్‌నగర్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలు సమర్పించే కార్యక్రమం మరి కొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. ఈ నెల 30న శాసన సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు నామినేషన్ల ఏర్పాట్లకు సంబంధించి అన్నీ పూర్తి చేశారు. నేటి నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 13న నామినేషన్ల పరిశీలన, 14న ఉపసంహరణ, 15న గుర్తుల కేటాయింపు ఉంటుంది. షాద్‌నగర్ పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఈ తంతు జరగనుంది.

ఇదీ నామినేషన్ల విధానం..

- అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్ వేయొచ్చు
- నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి పొందొచ్చు.
- నామినేషన్ పత్రాలు ఫాం 2బీ ద్వారా సమర్పించాలి. దీంతో పాటుగా అఫిడవిట్ దాఖలు చేయాలి. ఇందులో ఆస్తులు, రాబడి, ఖర్చులు, అప్పులు, పన్నుల బకాయిలు, క్రిమినల్ కేసుల వివరాలు నమోదు చేయాలి.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు జనరల్ కేటగిరి అయితే రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీలు అయితే రూ.5వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. వీటిని బ్యాంకు చలానా రూపంలో చెల్లించాలి.
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సంబంధిత అధికారి నుంచి పొందిన కులధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది.
- నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలో అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తారు.
- నామపత్రాలు దాఖలు చేసే సమయంలో ప్రమాణం చేయాల్సి ఉంటుంది. నామినేషన్‌ను ఆన్‌లైన్‌లో కూడా దాఖలు చేయొచ్చు
- జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థి నామినేషన్ వేసే సమయంలో ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. స్వతంత్ర అభ్యర్థి అయితే పది మంది ప్రతిపాదించాల్సి ఉంటుంది.
- అభ్యర్థిని ప్రతిపాదించే వారు అదే నియోజకవర్గానికి చెందిన వారై ఉండాలి
- నామినేషన్ వేసే అభ్యర్థి ప్రత్యేకంగా జాతీయ బ్యాంకులో ఖాతాను తెరిచిన జిరాక్స్ పత్రులు అందజేయాలి.
- నామినేషన్‌కు వచ్చే అభ్యర్థులు ర్యాలీలు నిర్వహిస్తే విధిగా అనుమతులు తీసుకోవాలి.
- నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలోనే వాహనాలు నిలిపివేయబడును.
- నామినేషన్ల ప్రక్రియ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే సాగుతుంది. సెలవు రోజుల్లో స్వీకరణ ఉండదు.

చేవెళ్ల: ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు వేసేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సాయిరాం తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లకు అవకాశం కల్పించారు. ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు వేసుకోవచ్చని చెప్పారు. ఈ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్‌అధికారికి గానీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి గానీ అందజేయాలని సూచించారు. నామినేషన్లు వేసిన అభ్యర్థులు ఉపసంహరించుకునేందుకు 15వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు.

స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి



నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. నేటి నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తాం. నామినేషన్లు వేసే వారి కోసం ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్కును ఏర్పాటు చేశాం. నిబంధనల ప్రకారం అభ్యర్థితో సహా ఐదుగురికే కేంద్రంలోకి అనుమతిస్తాం.

– వెంకట మాధవరావు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, షాద్‌నగర్

నిబంధనలు తప్పనిసరి



నామినేషన్లు వేసేందుకు వచ్చే అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలన్నారు. అభ్యర్థితోపాటు నలుగురికి మాత్రమే లోపలికి అనుమతి ఉంటుందన్నారు. చేవెళ్ల ఎస్సీ నియోజకవర్గం కాబట్టి ఇక్కడ పోటీ చేసే అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. పోటీ చేసే అభ్యర్థి రూ.40లక్షల వరకు ఎన్నికల ఖర్చు చేసుకోవచ్చన్నారు.

– పి. సాయిరాం, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, చేవెళ్ల

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

- సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి
- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు
- పట్టణ సీఐ ప్రతాప్‌లింగం



షాద్‌నగర్‌రూరల్: ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పట్టణ సీఐ ప్రతాప్‌లింగం అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న నిర్వహించనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సభలు, సమావేశాలు, ర్యాలీలను నిర్వహించాలనుకుంటే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి భయం, బెదిరింపులకు లోనుకాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. నేటి నుంచి ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో లింగారెడ్డిగూడ సమీపంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 11గంలనుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ నెల 3నుంచి 15వరకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ నిబంధన వర్తిస్తుందన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ బుజ్జి, బాబు నాయక్, మొండో నిరాయి తండా సర్పంచ్ సుగుణ, ఉప సర్పంచ్ మంగ్య నాయక్, కోఆప్షన్ సభ్యుడు దేశ్యా నాయక్, షాద్‌నగర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వీరాంజనేయులు గౌడ్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ నవాజ్ రెడ్డి, శ్రీరంగాపూర్ సర్పంచ్ భీమిడి అరుంధతి, రమేష్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, జెడ్పీటీసీలు వెంకట్ రాంరెడ్డి, తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్, ఖాదర్‌గోరి పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు మరో షాక్ తగిలింది. నందిగామ ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్‌లు గురువారం సాయంత్రం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. అనంతరం శంషాబాద్‌లోని ఎంపీపీ నివాసంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి సమక్షంలో ఎంపీపీ దంపతులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ఎంపీపీ ప్రియాంక దంపతులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కేశంపేటలో..

కేశంపేట: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామంలో పార్టీ గ్రామ కార్యాలయాన్ని తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీల గురించి కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, మంజుల మల్లేశ్ యాదవ్, విజయ్‌రెడ్డి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్: కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీపీ బుజ్జి బాబు నాయక్


నందిగామ: పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

'గ్యారంటీ'గా అమలు చేస్తాం


చేవెళ్ల: పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పామెన భీంభరత్


శంకర్‌పల్లిలో మాట్లాడుతున్న భీంభరత్

కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు 'గ్యారంటీ'లను ఖచ్చితంగా అమలు చేస్తామని అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం అల్లవాడ, జాలగూడ గ్రామాల్లో మాజీ సర్పంచ్ క్రిష్టారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, బాలలింగయ్యల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. చనువెళ్లిలో వెంకటేశ్‌చారి బీఆర్‌ఎస్ నుంచి చేరారు. ఈ సందర్భంగా వారికి భీంభరత్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలు గుర్తించారన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో వీరేందర్‌రెడ్డి, ఆగిరెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, టీకుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం కేటాయించకపోవడం అన్యాయం..

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్లను స్థానికులకు కాకుండా నగరానికి చెందిన వారికి కేటాయించడం బాధాకరమని పామెన భీంభరత్ అన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 11, 12వ వార్డుల్లో ఇంటిటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. యాదయ్య తన కుటుంబానికి రెండు జెడ్పీటీసీలు, ఎంపీపీ పదవులను తన కుటుంబ సభ్యులకు కట్టబెట్టుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కె. ఉదయమోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు వై. ప్రకాశ్‌గుప్తా, కౌన్సిలర్ రాములు, ఎజాస్, రాజుగౌడ్, శ్రీశైలం, రాంచందర్, ప్రణీత్‌కుమార్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి


పాపిరెడ్డిగూడలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూసి ఎన్నికల్లో గెలిపించి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం పాపిరెడ్డిగూడ, తూర్పుగడ్డతండా, దత్తాయపల్లి, ఇప్పలపల్లి, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని అన్నారు. కేసీఆర్ కిట్ ద్వారా బాలింతలకు రూ.13వేలు, మిషన్‌భగీరథతో ఇంటింటికి మంచినీరు, కళ్యాణలక్ష్మీ, షాదీ ముభారక్ వంటి పథకాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, తలసాని వెంకట్‌రెడ్డి, జమాల్‌ఖాన్, నవీన్‌కుమార్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం అరికట్టేందుకు నిఘా

- రవాణా, నిల్వలపై టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలి
- చేవెళ్ల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత


ఇన్‌స్పెక్టర్ శ్రీలత

చేవెళ్ల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో అక్రమ మద్యం అరికట్టుటకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చేవెళ్ల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత పేర్కొన్నారు. గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేవెళ్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ పరిధిలో ఎక్కడైన అక్రమ మద్యం రవాణా చేసినట్లుగానీ, మద్యం నిల్వలు ఉన్నట్లుగానీ సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ 18004252523 నెంబర్‌కు సమాచారం చేరవేయాలన్నారు. మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌లు సమయ పాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామాల్లో బెల్టుషాపులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎక్కడైనా, ఎవరైనా అమ్మినట్లు తెలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని శ్రీలత హెచ్చరించారు.

బైకులు ఢీకొని వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామ శివారుల్లో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంతప్పగూడ గ్రామానికి చెందిన వడ్డె సురేశ్(35) ఎన్కేపల్లి గేటు నుంచి కొత్తపల్లికి వెళ్తున్నాడు. కొత్తపల్లి గ్రామ శివారులోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై సురేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి..


బుగ్గరాములు (ఫైల్)

షాబాద్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన షాబాద్ మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. షాబాద్ సీఐ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మాచన్‌పల్లి గ్రామానికి చెందిన బోడ బుగ్గరాములు(42) ద్విచక్ర వాహనంపై షాబాద్ నుంచి మాచన్‌పల్లి గ్రామానికి వెళ్తుండగా షాబాద్ గ్రామ సమీపంలోని బీబీజీ వెంచర్ పక్కన బైక్ అదుపుతప్పింది. అక్కడ రోడ్డు పక్కనే ఉన్న కడిరాయికి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన బుగ్గరాములు పరిస్థితి విషమించి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శుభాకాంక్షలు

శంషాబాద్: రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ఖరారైన తోకల శ్రీనివాస్‌రెడ్డికి పలువురు బీజేపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వైఫల్యాలపై విస్తృత ప్రచారం చేయాలని ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి పార్టీ నేతలకు సూచించారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు


ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్

రిటర్నింగ్ కార్యాలయం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన

చేవెళ్ల: ఎన్నికల నిర్వహణకు పకడ్బంది ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్ అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను, ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. నేటి నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి చేసిన ఏర్పాట్లను చేవెళ్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాంను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్లు, పరిశీలన, తిరస్కరణ, తుది జాబితా ప్రకటన తదితర అన్ని వివరాలు ఎన్నికల నియమావళి ప్రకారం పక్కాగా జరగాలని చెప్పారు. అనంతరం చేవెళ్లలోని ఫరా కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 298 పోలింగ్ కేంద్రాలకు సబంధించిన ఎన్నికల సామగ్రి, ఎన్నికల సిబ్బంది ఇక్కడి నుంచే వెళ్లే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు రిటర్నింగ్ అధికారి సాయిరాం వివరించారు. ఎలాంటి ఇబ్బందులు అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్లు క్రిష్ణయ్య, సురేందర్, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్‌లు ఉన్నారు.

'కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తాం'


ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తామని చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, గోనె ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ ఆగిరెడ్డి, మహిళ అధ్యక్షురాలు సమత, సరిత, వీరేందర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు పేర్కొన్నారు. గొల్లపల్లి, ధర్మసాగర్ గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్‌ను గెలిపించాలని వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తెలంగాణ వస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పిన కేసీఆర్ అప్పుల ఊబిలో నెట్టారని విమర్శించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కూడా నియోజకవర్గాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రెండు సార్లు బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇచ్చారని ఒక్కసారి రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ కోసం కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలని వారు కోరారు. నిత్యం అందుబాటులో ఉండే పామెన భీంభరత్‌ను గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, లొంక శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్, మధుసూదన్ గుప్తా, ప్రభాకర్, ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, పాండు, రాములు, టీకుపల్లి శ్రీనువాస్ పాల్గొన్నారు.